నమస్తే తెలంగాణ

వరంగల్ హనుమకొండ

5 శుక్రవారం 26 జనవరి 2024 WARANGAL HANUMAKONDA





గణతంత్ర వేడుకలకు ముస్తాబైన వరంగల్ కమిషనరేట్ పరేడ్ మైదానం

# జెండా పండుగకు వేళాయె..

- గణతంత్ర వేడుకలకు సర్వం సిద్ధం
- ముస్తాబైన పరేడ్ మైదానాలు
- పతాకాలను ఆవిష్కరించనున్న కలెక్టర్లు



హనుమకొండ పబ్లిక్‌గార్డెన్ వద్ద జాతీయ జెండాలను కొనుగోలు చేస్తున్న నగర వాసులు

జెండా పండుగకు వేళ యింది. శుక్రవారం 75వ గణతంత్ర దినోత్సవ వేడుకల కోసం అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసింది. హనుమకొండలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్, వరంగల్‌లోని ఖుష్‌మహల్, మహబూబాబాద్‌లోని ఎన్టీఆర్ స్టేడియం, భూపాలపల్లిలోని అంబేద్కర్ స్టేడియం, ములుగు జిల్లాకేంద్రంలోని తంగేడు మైదానాలను వివిధ రంగులతో తీర్చిదిద్దారు. వేడుకలను తిలకించేందుకు వచ్చే ప్రముఖులు, ప్రజాప్రతినిధులు, ప్రజల కోసం షామియానాలు, కుర్చీలు సిద్ధం చేయగా వేదిక పరిసరాలను మువ్వన్నెల జెండాలతో అందంగా ముస్తాబుచేశారు. ఉదయం 9 గంటలకు కలెక్టర్లు ఎక్కడికక్కడ జాతీయ జెండాలను ఆవిష్కరించనుండగా రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను తెలియజేసేలా శకటాలను ప్రదర్శించనున్నారు. కాగా మూడు రంగుల జెండాలు, బ్యాడ్జ్‌లు, డ్రెస్సులు, వివిధ అలంకరణ సామగ్రి కొనుగోళ్లతో మార్కెట్లలో సందడి నెలకొంది.

- నమస్తే తెలంగాణ నెట్‌వర్క్, జనవరి 25

# పంటలకు నీళ్లివ్వలేం



**ఆరుతడి పంటలు వేసుకోవాలి: పీఆర్ ఈఈ మోహన్‌రావు**

జయశంకర్ భూపాలపల్లి, జనవరి 25 (నమస్తే తెలంగాణ) : యాసంగి పంటలకు నీళ్లివ్వలేమని ములుగు ఇరిగేషన్ సర్కిల్ పర్యవేక్షక ఇంజినీర్ వై మోహన్‌రావు గురువారం తెలిపారు. ఎస్ఆర్ఎస్పీ స్టేజ్-1 డీబీఎం-38 కాలువ ద్వారా భూపాలపల్లి జిల్లా పరిధిలోని చివరి ఆయకట్టుకు (అనగా యాసంగి పంట 2023-24) నీరు ఇవ్వలేకపోతున్నామని అన్నారు. శ్రీరాంసాగర్ లోయర్ మానేరు డ్యాం, ఇతర రిజర్వాయర్లలో నీటి లభ్యత లేకపోవడం వల్ల చివరి ఆయకట్టు భూములకు నీరందించలేమన్నారు. బావులు, బోర్ల సదుపాయం ఉన్న రైతులు మాత్రమే కాలువ నీటిపై ఆధారపడకుండా ఆరుతడి పంటలు వేసుకోవాలని కోరారు.

# గడ్డం సమ్మయ్యకు పద్మశ్రీ

**ప్రకటించిన కేంద్రం**

**చిందు యక్షగాన కళాకారుడికి అరుదైన గౌరవం**

**సమ్మయ్యది దేవరుప్పుల మండలం అప్పిరెడ్డిపల్లి**





దేవరుప్పుల, జనవరి 25 : పద్నాలుగేళ్ల ప్రాయంలో 'చిన్నికృష్ణుడి'గా కళారంగంలోకి అడుగుపెట్టి.. 'కీచక' పాత్రతో గుర్తింపు తెచ్చుకొని, 'రంగస్థలం'పై లోహితాస్యుడు, సిరియాళుడు, బాలవద్ధి, సత్యహరిశ్చంద్రుడు, కంసుడు, కృష్ణుడు, దుర్యోధనుడు, రావణుడి వేషధారణలతో ప్రేక్షకులను అలరించి..సామాజిక కార్యక్రమాలు, అవగాహన అంశాలపై వేలాది ప్రదర్శనలతో ప్రజలను మెప్పించిన గడ్డం సమ్మయ్యను 'పద్మశ్రీ' వరించింది. జనగామ జిల్లా దేవరుప్పుల మండలం అప్పిరెడ్డిపల్లి చెందిన చిందు యక్షగాన కళాకారుడు గడ్డం సమ్మయ్యకు పద్మశ్రీ అవార్డు రావడంతో ఉమ్మడి జిల్లాకు గర్వకారణంగా నిలిచింది. రామస్వామి, ఛండికాంబ దంపతులకు 1958, జనవరి 5న సమ్మయ్య జన్మించాడు. ఆయనకు అక్క, ఇద్దరు తమ్ముళ్లు, ఇద్దరు చెల్లెల్లు. సంచార జీవితం గడుపుతూ సమ్మయ్య కుటుంబం అప్పిరెడ్డిపల్లిలో స్థిరపడింది. గ్రామంలోనే సమ్మయ్య ఆరో తరగతి వరకు చదువుకున్నాడు. సమ్మయ్యకు 1983లో శ్రీరంజనితో వివాహమైంది. వారికి ముగ్గురు కొడుకులు. పెదకొడుకు సోమరాజు చిందు కళా ప్రదర్శనలు ఇస్తున్నాడు. రెండో కొడుకు హిమగిరి ఇంజినీరింగ్ పూర్తిచేసి మల్టీనేషనల్ కంపనీలో ఉద్యోగం చేస్తున్నాడు. మూడో కొడుకు మురళీకృష్ణ ఫొటోగ్రఫీలో బీఎఫ్ఏ పూర్తిచేశారు. తన తండ్రి ప్రోత్సాహంతో చిన్ని కృష్ణుడి వేషధారణతో కళారంగంలోకి అడుగుపెట్టిన సమ్మయ్య, 1985లో జనగామ పురపాలక సంఘం కార్యాలయంలో 'కీచకవధ' ప్రదర్శనలో కీచకుడి పాత్రతో గుర్తింపు తెచ్చుకున్నాడు. 1988లో నెహ్రూ యువకేంద్రం ద్వారా ప్రదర్శనలు ఇవ్వడం ప్రారంభించాడు. తొమ్మిది మంది బృందంతో రాష్ట్ర, జాతీయస్థాయి వేదికలతో పాటు 1991లో ఆలిండియా రేడియోలో 80 ప్రదర్శనలు, దూరదర్శనిలో 30 ప్రదర్శనలు, యువజన సాంస్కృతిక పర్యాటక శాఖల ఆధ్వర్యంలో వేలాది ప్రదర్శనలు ఇచ్చాడు. 1991లో కళాకారుల సంఘాన్ని ప్రారంభించిన ఆయన ప్రభుత్వం తరఫున అనేక సామాజిక కార్యక్రమాలు, అవగాహన అంశాలపైనా ప్రదర్శనలు ఇచ్చాడు. 5దశాబ్దాలలో 19వేల ప్రదర్శనలతో అరుదైన గుర్తింపు సాధించాడు. సమ్మ య్య జీవిత విశేషాలతో 'చిందుల హంస' అనే పుస్తకం కూడా వెలువడింది.

**పురస్కారాలు**

1985లో తెలుగు విశ్వవిద్యాలయం పూర్వ ఉపకులపతితో సన్మానం, 1994లో తెలుగు విశ్వవిద్యాలయం ప్రతిభా పురస్కారం, 1995లో తెలుగు విశ్వవిద్యాలయం వార్షికోత్సవంలో అప్పటి గవర్నర్ చేతులమీదుగా కళారత్న (హంస) పురస్కారం, రూ. 5వేల నగదు బహుమానం, 2001లో నల్గొండలో జరిగిన రాష్ట్రస్థాయి ఉత్సవాల్లో సన్మా నం, 2003లో హైదరాబాద్‌లోని శిల్పారామంలో అప్పటి సీఎం చేతుల మీదుగా విశిష్ట పురస్కారం, 2009లో తెలుగు విశ్వవిద్యాలయం నుంచి బంగారు కంకణం ప్రదానం, 2017లో 'తెలంగాణ ఆవిర్భావ పురస్కారం' అందుకున్నారు. తాజాగా ఆయనకు కేంద్ర ప్రభుత్వం గురువారం సాయంత్రం పద్మశ్రీ అవార్డును ప్రకటించింది. చిందు యక్షగాన కళాకారుడిగా కళారంగానికి ఆయన చేసిన సేవలకు గాను ఈ గుర్తిం పు దక్కింది. సమ్మయ్యకు పద్మశ్రీ అవార్డు రావడంపై మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు, జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. సమ్మయ్యకు ఫోన్ చేసి శుభాకాంక్షలు తెలిపారు.

# వెయ్యేళ్లు వర్ధిల్లేలా..

*వేయి స్తంభాల ఆలయ కల్యాణ మండపం*

- మార్చిలో ప్రారంభించనున్న ప్రధాని మోదీ
- థౌజండ్ పిల్లర్ టెంపుల్‌ను యునెస్కోలో చేర్చే అవకాశం
- కేంద్ర పురావస్తు శాఖ డైరెక్టర్ జనరల్ యధుబీర్‌సింగ్ రావత్



వేయిస్తంభాల దేవాలయంలోని కల్యాణమండపాన్ని పరిశీలిస్తున్న కేంద్ర పురావస్తు శాఖ డైరెక్టర్ జనరల్ యధుబీర్‌సింగ్ రావత్

హనుమకొండ చౌరస్తా, జనవరి 25: చారిత్రక వేయిస్తంభాల ఆలయంలోని కల్యాణమండపాన్ని వెయ్యేళ్లు నిలిచేలా నాణ్యతతో పటిష్టంగా నిర్మిస్తున్నట్లు కేంద్ర పురావస్తు శాఖ డైరెక్టర్ జనరల్ యధుబీర్ సింగ్ రావత్ తెలిపారు. గురువారం ఆలయంలోని కల్యాణమండపాన్ని అడిషనల్ డైరెక్టర్ జాన్‌వీజ్‌శర్మ, డైరెక్టర్ రాంజినగమ్, రీజినల్ డైరెక్టర్ పాఠక్, హైదరాబాద్ సర్కిల్ సూపరింటెండెంట్ స్మిత్ ఎస్ కుమార్, ఇంజినీర్ కృష్ణచైతన్యతో కలిసి ఆయన పరిశీలించారు. వారికి ఈవో కె.వెంకటయ్య స్వాగతం పలుకగా, రుద్రేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ప్రధానార్చకుడు గంగు ఉపేంద్రశర్మ తీర్థప్రసాదాలు, శేషవస్త్రాలు అందించారు. ఈ సందర్భంగా యధుబీర్ సింగ్ మాట్లాడుతూ కల్యాణ మండపం పనుల్లో కొంత జాప్యం జరిగినా నాణ్యమైన కట్టడాలతో నిర్మిస్తున్నట్లు చెప్పారు. మార్చిలో ప్రారంభించేందుకు ప్రధాని మోదీ రానున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం సహకరిస్తే ఆలయం చుట్టూ ఉన్న ఇండ్లను తొలగించి అక్కడి వారిని వేరే చోటికి తరలిస్తే రామప్ప తరహాలో వేయిస్తంభాల దేవాలయాన్ని యునెస్కోలో చేర్చేలా ప్రతిపాదనలు పంపిస్తామని అన్నారు. ఇంకా 8 స్తంభాలు అమర్చి పైకప్పు ఏర్పర్చాలని, మార్చి నెలలోపు కల్యాణ మండపం పనులు పూర్తవుతాయని స్థపతి శివకుమార్ పేర్కొన్నారు. పూర్తిస్థాయిలో త్రికూటాలయం చుట్టూ కింది భాగంలో రెండు లేయర్లు పైకి తీయాల్సిన అవసరం ఉందని, త్వరితగతిన పూర్తిచేసి గార్డెన్ ఆహ్లాదకరంగా ఉండేలా చేస్తామని పురావస్తుశాఖ జిల్లా అధికారి మల్లేశం చెప్పారు. ఈ దేవాలయం త్రికూటాలయంగా కాకతీయులు భక్తుల మనోభావాలకనుగుణంగా నిర్మించారని, కానీ రాష్ట్ర, కేంద్ర పురావస్తుశాఖ అధికారులు అనేక ఇబ్బందులు కలిగిస్తున్నారని గంగు ఉపేంద్రశర్మ డైరెక్టర్ జనరల్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. ఈ సందర్భంగా రామప్ప దేవాలయ పరిసర ప్రాంతాల్లో పనుల విషయంలో అలసత్వం జరుగుతోందని మాజీ మేయర్ తక్కళ్లపల్లి రాజేశ్వర్‌రావు, ప్రొఫెసర్ పాండు రంగారావు డైరెక్టర్ జనరల్‌కు ఫిర్యాదు చేశారు.



గొర్రెకుంటలోని జిన్నింగ్ మిల్లులో సీసీఐ కొనుగోలు కేంద్రానికి రైతులు తీసుకొచ్చిన పత్తి

# పత్తికి మద్దతుపై సీసీఐ మెలిక

**తేమ శాతం అధికంగా ఉందని అధికారుల కొర్రీలు**

- మొత్తం పత్తి కొనేందుకు ససేమిరా..
- కొనుగోలు కేంద్రాల్లో 40 శాతమే కొంటున్న సీసీఐ
- క్వింటాల్‌కు రూ.వెయ్యికిపైగా నష్టం

వరంగల్, జనవరి 25 (నమస్తేతెలంగాణ) : ఈ ఏడా ది పత్తి రైతుకు ప్రతికూల పరిస్థితులు ఎదురయ్యాయి. ఆరంభంలో భారీ వర్షాలు కురవడం వల్ల పత్తి మొక్క ఎదుగుదలపై ప్రభావం పడింది. ఆ తర్వాత చీడపీడలు ఆశించడంతో దిగుబడులు గణనీయంగా తగ్గాయి. తీరా ప్రభుత్వ 'మద్దతు' కూడా లభించకపోతుండడంతో రైతులకు నష్టాలే మిగులుతున్నాయి. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో సీసీఐ అధికారులు రైతుల నుంచి పత్తిని కొనుగోలు చేయడానికి కొర్రీలు పెడుతున్నారు. నాణ్యత పేరుతో ఎక్కువ శాతం పత్తిని రిజెక్ట్ చేస్తున్నారు. దీంతో రైతులు చివరకు తక్కువ ధరకు వ్యాపారులకు అమ్ముతున్నారు. పొడవు పింజ పత్తి క్వింటాల్‌కు ప్రభుత్వ మద్దతు ధర రూ.7,020, పొట్టి పింజ పత్తికి రూ.6,620. ప్రభుత్వం ఇటీవల జిన్నింగ్ మిల్లుల్లో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసింది. వరంగల్ జిల్లాలో 24 కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు మార్కెటింగ్ శాఖ అధికారులు వెల్లడించారు. ఈ ఏడాది పత్తి సాగు విస్తీర్ణం వివరాలతో కూడిన సాఫ్ట్‌వేర్ కొనుగోలు కేంద్రాల్లో అందుబాటులో ఉందని, మద్దతు ధరతో పత్తిని కొనుగోలు చేస్తామని ప్రచారం చేశారు. దశలవారీగా జిల్లాలోని 24 సెంటర్లలో కొనుగోళ్లు ప్రారంభించారు. అయితే మద్దతు ధర దక్కుతుందనే ఆశతో రైతులు ఈ కేంద్రాలకు తరలిస్తుండగా, సీసీఐ నలభై శాతం పత్తిని మాత్రమే కొంటున్నట్లు తెలుస్తోంది. తేమ శాతం ఎక్కువగా ఉందని, నాణ్యత లేదని తిరస్కరిస్తున్నా రు. దీంతో రైతులు విధి లేక వ్యాపారులకు విక్రయిస్తున్నారు. ఫలితంగా ఒక్కో క్వింటాల్‌కు రూ.వెయ్యికిపైగా కోల్పోతున్నారు. కొనుగోలు కేంద్రాల్లో మద్దతు ధర క్వింటాల్‌కు రూ.7,020. వ్యవసాయ మార్కెట్, ఇతర ప్రాంతాల్లో ప్రైవేట్ వ్యాపారులకు అమ్ముతున్న పత్తికి క్వింటాల్‌కు రూ.5,800 నుంచి రూ.6వేల వరకు వస్తున్నది. తేమ శాతం 8 నుంచి 12లోపే ఉంటున్నా పత్తిని కొనడం లేదని మార్కెటింగ్ శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదని రైతులు కుమిలిపోతున్నారు.

**సీసీఐ కొనుగోళ్ల తీరిది..**

జిల్లాలో 4,47,757 క్వింటాళ్ల పత్తి కొనుగోలు జరిగింది. ఎనుమాముల మార్కెట్ పరిధిలో 3,66,117 క్వింటాళ్లు, నర్సంపేటలో 1,721, నెక్కొండలో 26,779, వర్ధన్నపేటలో 53,140 క్వింటాళ్ల కొనుగోలు జరిగినట్లు మార్కెటింగ్ శాఖ అధికారులు తెలిపారు. ఇతర ప్రాంతాల్లో వ్యాపారులు 7,03,618 క్వింటాళ్లు కొనుగోలు చేశారు. ఇందులో ఒక ఎనుమాములలోనే 6.10 లక్షల క్వింటాళ్ల పత్తిని వ్యాపారులు కొనుగోలు చేశారు. కేంద్రాల్లో సీసీఐ అధికారులు రిజెక్ట్ చేసిన పత్తిని రైతులు ఎనుమాముల మార్కెట్‌కు తరలిస్తున్నారు. ఈ మార్కెట్‌లో క్వింటాల్ పత్తికి జెండా పాట గరిష్ఠ ధర రూ.6,675, కనిష్ఠ ధర రూ.5,600 పలికింది. వ్యాపారులు మాత్రం క్వింటాల్‌కు రూ.6 వేలకు మించి ధర చెల్లించలేదని తెలిసింది.

# దళితులకు అండగా బీఆర్ఎస్

- దళితబంధు నిధులు వెంటనే విడుదల చేయాలి
- బీఆర్ఎస్ ములుగు జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారావు
- లబ్ధిదారుల ఒకరోజు దీక్షకు మద్దతు



దీక్షను ఉద్దేశించి మాట్లాడుతున్న బీఆర్ఎస్ ములుగు జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారావు

ములుగురూరల్, జనవరి25 : దళితులకు లబ్ధి చేకూర్చింది ఒక్క కేసీఆర్ ప్రభుత్వమేనని బీఆర్ఎస్ ములుగు జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మీనర్సింహారావు అన్నారు. దళిత బంధు సాధన సమితి అధ్యక్షుడు కోగిల మహేశ్ ఆధ్వర్యంలో గురువారం ములుగు జిల్లా కేంద్రంలోని గాంధీ చౌక్ వద్ద దళిత బంధు లబ్ధిదారులు ఒకరోజు దీక్షను చేపట్టారు. వారికి మలక్ష్మీనర్సింహారావుతో పాటు ఎంపీపీ గండ్రకోట శ్రీదేవీ సుధీర్‌యాదవ్, సీపీఎం నాయకులు రత్నం రాజేందర్, ప్రజాసంఘాల జేఏసీ అధ్యక్షుడు ముంజాల భిక్షపతిగౌడ్, సీపీఐ నాయకుడు రత్నం ప్రవీణ్, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు పోరిక గోవింద్‌నాయక్, పల్లా బుచ్చయ్య మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ కేసీఆర్ ప్రభుత్వం దళితబంధు పథకాన్ని తీసుకొచ్చి మొదటి విడుత లబ్ధిదారులకు వారి ఖాతాల్లో రూ.10 లక్షల చొప్పున జమ చేసిందన్నారు. 2వ విడుత జిల్లాలో 1,100 మంది లబ్ధిదారులను ఎంపిక చేయగా ఎన్నికల కోడ్ కారణంగా ఆగిపోయాయన్నారు. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ దళితుల సంక్షేమాన్ని విస్మరించి వారికి అందాల్సిన దళితబంధు డబ్బులను అడ్డుకున్నదన్నారు. దళితులకు అన్యాయం చేయాలని చూస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. కాంగ్రెస్ ఎన్నికల మ్యానిఫెస్టోలో పొందుపర్చిన అంబేద్కర్ అభయహస్తం పథకం కింద రూ.12లక్షలను దళితులకు అందించాలన్నారు. దీక్షకు భూపాలపల్లి, పినపాక, ఖమ్మం, మహబూబాబాద్, భద్రాద్రి కొత్తగూడ, ప్రాంతాలకు చెందిన దళిత నాయకులు మద్దతు ప్రకటించారు. ఎంపీటీసీ నూనావత్ మహేష్‌నాయక్, బీఆర్ఎస్ నాయకుడు కాకుల మర్రి ప్రదీప్‌రావు, దళిత సంఘాల నాయకులు కర్రి శ్యాంబాబు, మేడికొండ రమేశ్, చిన్ని కృష్ణ, రాజేశ్, చంటి, భద్రయ్య, జనగాం రవీందర్, గట్టయ్య, మేదరి రాంబాబు, కొర్రె ఓంకార్, కవ్వంపల్లి బాబు, జన్నారపు శ్రీను, శ్రీనివాస్, మంద కొమ్మాలు, దర్శనాల దేవేందర్, రామకృష్ణ, లేగల రాజు, సమ్మయ్య, జయరాజు దీక్షలో పాల్గొన్నారు.






# పగలు ప్లాస్టిక్ ఏరి.. రాత్రి గుళ్లల్లో చోరీ

- ఏడుగురు నిందితులను పట్టుకున్న పోలీసులు
- ఇత్తడి విగ్రహాలు, నగదు స్వాధీనం
- డీఎస్పీ వెంకటేశ్వరబాబు



ఆలయాల్లో వరుస చోరీలకు పాల్పడిన ముఠాను అరెస్టు చూపుతున్న డీఎస్పీ వెంకటేశ్వరబాబు



పట్టుబడిన ఇత్తడి వాహనాలను చూపుతున్న డీఎస్పీ వెంకటేశ్వరబాబు, సీఐ సత్యనారాయణ, ఎస్సైలు

తొర్రూరు, జనవరి 25 : పగటి పూట ప్లాస్టిక్ వ్యర్థాలు, ఖాళీ బీరు సీసాలు ఏరుతూ.. రాత్రి అయిందంటే తాళం వేసి ఉన్న ఇళ్లు, ఆలయాల్లోకి చొరబడి ఇత్తడి, ఇనుప వస్తువులు, ఉత్సవ విగ్రహాలు, వాహనాలను అపహరించి అమ్ముకుంటున్న ముఠా గుట్టును తొర్రూరు పోలీసులు రట్టు చేశారు. నల్గొండ జిల్లా నకిరేకల్ మండలం టీచర్స్‌కాలనీ, కేతేపల్లి మండల కేంద్రానికి చెందిన ఏడుగురిని అరెస్టు చేసి, వారి నుంచి దొంగిలించిన వస్తువులు, నగదు, ఆటోను స్వాధీనం చేసుకున్నారు. ఈమేరకు చోరీ వివరాలను గురువారం తొర్రూరు పోలీస్‌స్టేషన్‌లో డీఎస్పీ వెంకటేశ్వరబాబు వెల్లడించారు. తొర్రూరుతో పాటు మరిపెడ, దంతాలపల్లి, మండలాల్లోని పలు ఆలయాల్లో ఇటీవల చోరీలకు పాల్పడి ఇత్తడి వస్తువులు, ఉత్సవ విగ్రహాలను ఊరేగించే వాహనాలను దొంగిలిస్తున్న ఆవుల సంజీవ, నాగిళ్ల నాగరాజు, ఎడ్ల వెంకటమ్మ, ఎడ్ల పుణమ్మ, నాగిళ్ల దుర్గ, గోపగాని రాజమ్మ, కేతేపల్లికి చెందిన పాత ఇనుప సామగ్రి కొనుగోలు వ్యాపారి చింతల పుల్లారావును అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. గతంలో వీరిపై నకిరేకల్ స్టేషన్‌లో కేసులు ఉన్నాయి. ఈ ముఠా బొగ్గు లారీల లోడింగ్ కోసం కూలీకి వెళ్లడం, ఖాళీ సమయాల్లో ప్లాస్టిక్ సామగ్రి, ఖాళీ సీసాలను సేకరించి విక్రయించేవారు. కాగా, సులభంగా డబ్బులు సంపాదించాలనే దురాశతో గతంలో దొంగతనం చేస్తూ పట్టుబడి నల్గొండ జిల్లాలో జైలు శిక్ష అనుభవించి విడుదలై వచ్చారు. అయినా వారిలో మార్పు రాలేదు. గతేడాది జూన్ నెలలో తొర్రూరు మండలం మాటేడు వేణుగోపాలస్వామి ఆలయంలో, పెద్ద ముప్పారం వేంకటేశ్వరస్వామి ఆలయంలో, మరిపెడ మండలం గుండెపూడిలోని సీతారామచంద్రస్వామి ఆలయంలో, తొర్రూరు మండలం అమ్మాపురంలోని సీతారామచంద్రస్వామి ఆలయాల్లో ఇత్తడితో తయారు చేసిన వస్తువులు, ఊరేగింపు వాహనాలను అపహరించారు. మరిపెడ మండలం ఎల్లంపేట గ్రామ శివారు, జమ్మికుంట తండాల్లోని 25కేవీ ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి కాపర్ వైర్‌ను చోరీ చేశారు. దంతాలపల్లి మండలం బీరిశెట్టిగూడెంలో ఓ ఇంట్లో వస్తువులు, అమ్మాపురం ఆలయంలో ఉత్సవ విగ్రహాల ఊరేగింపు వాహనాలను అపహరించి ఆటోలో తిరిగి వెళ్తూ గురువారం పోలీసులకు చిక్కారు. తొర్రూరులోని అంబేద్కర్ సెంటర్‌లో ఏడుగురిని అదుపులోకి తీసుకొని, వారి నుంచి రూ.60వేల నగదు, ఆటో, 45 కిలోల కాపర్ వైర్, గుండెపూడిలోని ఆలయానికి చెందిన సుమారు 60 కిలోల గరుడ వాహనం, 70 కిలోల అశ్వవాహనం, 40 కిలోల ఆంజనేయస్వామి విగ్రహం, 10 కిలోల ఇత్తడి గొడుగు, నాలుగు కిలోల దివిటీలు, 4 కిలోల ఇత్తడి చెంబులు, అమ్మాపురం ఆలయానికి చెందిన 40 కిలోల హనుమంతుడి వాహనం, 40 కిలోల ఇత్తడి అశ్వవాహనాలను స్వాధీనం చేసుకున్నారు. తొర్రూరు, మరిపెడలోని సీసీ కెమెరాల్లో నమోదైన దృశ్యాల ఆధారంగా కేసును ఛేదించారు. నిందితులను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన ఎస్సైలకు డీఎస్పీ రివార్డులను అందజేసి అభినందించారు. కార్యక్రమంలో తొర్రూరు సీఐ వై సత్యనారాయణ, తొర్రూరు, దంతాలపల్లి, మరిపెడ ఎస్సైలు జగదీశ్, రమేశ్, తహెర్‌బాబా, సిబ్బంది పాల్గొన్నారు.





